
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



నరసాపురం సెంట్రల్ బ్యాంక్‌లో స్కాం!



నాలుగేళ్ల క్రితం చనిపోయిన రైతు భూమిని చూపించి ఏడాది క్రితం నాలుగు కోట్ల రుణాలు

రుణం తీసుకునేందుకు వారసులు వెళ్లడంతో వెలుగు చూసిన భారీ మోసం

ఇప్పటికే మీ భూమిపై రుణం తీసుకున్నారన్న బ్యాంకు అధికారులు

అవాక్కయ్యి.. నిలదీసిన హక్కుదారులు..

రాత్రి వరకు ఉద్రిక్తత

పోలీసుల విచారణ.. నిబంధనల ప్రకారం చేశామన్న మేనేజర్ ప్రకాశ్

నరసాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): నరసాపురం సెంట్రల్ బ్యాంకులో భారీ రుణ కుంభకోణం వెలుగు చూసింది. రైతులకు తెలియకుండా లీజు అగ్రిమెంట్లను సృష్టించి.. ఇద్దరు వ్యక్తులు బ్యాంకులో రూ.4 కోట్ల రుణం తీసుకున్నారు. లీజుకు ఇచ్చారని చెబుతున్న వారిలో ఓ రైతు నాలుగేళ్ల క్రితం చనిపోయారు. గత ఏడాది చనిపోయిన ఈ రైతు లీజుకు ఇచ్చినట్లు పత్రాలు సృష్టించారు. సోమవారం అసలు రైతులు బ్యాంకుకు వెళ్లి రుణం తీసుకునేందుకు పత్రాలు ఇవ్వగా.. ఈ భాగోతం వెలుగుచూసింది. దీంతో బ్యాంకు అధికారులను రైతులు నిలదీశారు. ఐదు గంటలపాటు బ్యాంకులో ఉద్రిక్తత నెలకొంది. చివరికి పోలీసులు విచారణ చేపట్టారు. అయితే మేనేజర్ ప్రకాశ్ అంతా నిబంధనల ప్రకారమే రుణం ఇచ్చామని చెబుతున్నారు. వివరాలివి..

నరసాపురం మండలం వేములదీవికి చెందిన అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తిరుమాని నాగరాజు, ఆయన సోదరుడు శ్రీనివాస్, తల్లి పద్మావతి, తండ్రి వడ్డీకాసులకు 19 ఎకరాల భూమిలో చెరువులు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం వడ్డీకాసులు మృతి చెందారు. సోమవారం నాగరాజు, శ్రీనివాస్ రుణం కోసం ఓ జాతీయ బ్యాంకుకు పొలం దస్తావేజులు తీసుకువెళ్లారు. సర్వే నెంబర్లను పరిశీలించిన బ్యాంకు అధికారులు ఈ పొలాలపై నరసాపురం సెంట్రల్ బ్యాంకులో రుణాలు ఉన్నాయని చెప్పడంతో షాక్ తిన్నారు. వెంటనే ఆ బ్యాంకుకు వెళ్లి మేనేజర్ ప్రకాశ్‌ను నిలదీశారు. తమకు తెలియకుండా తమ పొలాలపై రుణం ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించారు. అయితే మేనేజర్ గత ఏడాది పట్టణానికి చెందిన కూనపరెడ్డి ప్రసాద్, డి.శేఖర్ పొలాలను లీజుకు చేస్తున్నట్లు అగ్రిమెంట్లు చూపించి రూ.4 కోట్లు రుణం తీసుకున్నట్లు తెలియజేశారు. దీంతో బాధిత రైతులు షాక్ తిన్నారు. కనీసం తమ దృష్టికి తీసుకురాకుండా అంత గుడ్డిగా ఇంత పెద్ద మొత్తంలో రుణాలు ఎలా ఇచ్చారంటూ నిలదీశారు. దీంతో బ్యాంకులో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న నరసాపురం టౌన్ ఎస్ఐలు ముత్యాలరావు, జయలక్ష్మి బ్యాంకుకు చేరుకుని రికార్డులను పరిశీలించారు.



రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

చనిపోయిన నాన్న పేరిట రుణం



మాకు వేములదీవిలో 19 ఎకరాలు భూమి ఉంది. నా పేరు, మా తమ్ముడు శ్రీనివాస్, అమ్మ పద్మ, నాన్న వడ్డీకాసుల పేరున ఈ పొలాలు ఉన్నాయి. మా నాన్న చనిపోయి నాలుగేళ్లు అయింది. మా పొలాలు, చెరువులను లీజ్ చేస్తున్నట్లు చూపించి రుణం తీసుకున్నారు. కనీసం రుణం ఇచ్చేటప్పుడు మా దృష్టికి బ్యాంకు అధికారులు తీసుకురాలేదు. మృతి చెందిన మా నాన్న సంతకాలను ఫోర్జరీ చేశారు. విచారిస్తే ఎన్నో స్కాంలు వెలుగుచూస్తాయి.

-తిరుమాని నాగరాజు, వేములదీవి

ఆస్తుల్ని తాకట్టు పెట్టుకునే రుణం ఇచ్చారు



నేను బ్యాంకును, రైతులను మోసం చేయలేదు. రుణం కావాలని బ్యాంకుకు వచ్చా. వాళ్లే ఈ లీజు డాక్యుమెంట్లు అన్ని నాకిచ్చారు. నేను రైతులతో లీజుకు సంబంధించి ఎటువంటి ఒప్పందం కుదుర్చుకోలేదు. రుణం ఇప్పించ డంలో మరో మధ్య వ్యక్తి ఉన్నాడు. అతన్ని పట్టుకుని విచారిస్తే మొత్తం విషయం బయటకొస్తుంది. బ్యాంకు అధికారులు నా ఆస్తులను తాకట్టు పెట్టుకునే రుణం ఇచ్చారు. నేను ఇప్పటికే రూ.5 లక్షలు వడ్డీ కట్టా.

-కూనపరెడ్డి ప్రసాద్, వ్యాపారి

అంతా నిబంధనల ప్రకారమే..

అంతా నిబంధనల ప్రకారమే రుణం ఇచ్చాం. రైతుల పొలాలను లీజు చేస్తున్నట్లు రుణం తీసుకున్న ఇద్దరు వ్యక్తులు చూపించారు. వారిద్దరి ఆస్తులను తాకట్టు పెట్టుకునే లోన్ ఇచ్చాం. రుణం ఇచ్చేటప్పుడు చెరువులను పరిశీలించి ఇచ్చాం.

-ప్రకాశ్, మేనేజర్



అందని కందిపప్పు

పెదవి విరుస్తున్న రేషన్ కార్డుదారులు

మార్కెట్‌లో కిలో రూ.120

రేషన్ దుకాణాల్లో కిలో రూ.67

గణపవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న కందిపప్పు ఈ నెలా అందలేదు.. ఈ ఏడాది జనవరిలో అరకొరగా సరఫరా అయినా ఫిబ్రవరి నుంచి పూర్తిగా కేటాయింపులు లేవు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏడాదిన్నరకు పైగా కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం నవంబర్‌లో కందిపప్పు సరఫరా పునఃప్రారంభించింది. తర్వాత రెండు నెలలు ఇచ్చింది. గడిచిన మూడు నెలలుగా సరఫరా కావడం లేదు. ప్రభుత్వం నుంచి ఎటువంటి కేటాయింపులు లేకపోవడంతో డీలర్లు సైతం డీడీలు కట్టలేదు. ప్రతీ నెల ఎండీయూ వాహనాల వద్దకు వచ్చిన వినియోగ దారులు కందిపప్పు గురించి అడిగితే లేదనే సమాధానం వస్తుండడంతో కార్డుదారులు పెదవి విరుస్తున్నారు. ఈ నెలలో ఇస్తారనుకుంటే ఇంకా రాలేదని ఎండీయూ వాహనదారులు చెబుతున్నారు.ఇంకా పైస్థాయి నుంచి గోదాములకు రాకపోకవడం వల్ల కేటాయింపులు జరగలేదని జిల్లా అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.120కి విక్రయిస్తున్నారు. చౌక దుకాణాల్లో రూ.67 ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో 5 లక్షల 58 వేల 19 రేషన్ కార్డులు ఉండగా 1052 చౌక దుకాణాలు ఉన్నాయి. ప్రతీ నెల 588 మెట్రిక్ టన్నులు అవసరం అవుతుంటుంది. వచ్చే నెల నుంచి అయినా కందిపప్పు సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి కాళ్లకూరు వెంకన్న కల్యాణోత్సవాలు



రేపటి నుంచి చిన వెంకన్న క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు 7



ప్రతీ అర్జీ పరిష్కరించాలి : కలెక్టర్

భీమవరంటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 149 మంది నుంచి అర్జీలను స్వీకరించారు. తమ బిడ్డ నూరు శాతం అంగ వైకల్యంతో కదలలేని పరిస్థితుల్లో ఉందని రూ.15 వేలు పెన్షన్ మంజూరు చేయాలని ఒక తల్లి కలెక్టర్‌ను కోరగా అర్హతకు కావలసిన ధ్రువపత్రాలు, బిడ్డ వాస్తవ పరిస్థితులను పరిశీలించి రూ.15 వేలు మంజూరుకు ఆన్లైన్లో పొందుపరచాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించారు. గణపవరం మండలం జల్లి కాకినాడ గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మంజుల ఆస్తి తగాదా విషయమై ఫిర్యాదు చేసేందుకు రావడంతో కలెక్టర్ స్వయంగా వెళ్లి తెలుసుకున్నారు. అమె చేతిలోని బిడ్డను చూసి చలించిపోయారు. బక్కచిక్కిపోయి ఉండడంతో ప్రశ్నించారు. ఐసీడీఎస్ పీడీ, హాస్పటల్ సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్‌ను పిలిచి ఈ బిడ్డ అనారోగ్యంగా ఉండడానికి కారణాలు తెలుసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.



దివ్యాంగురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

కొన్ని అర్జీలు ఇవీ :

తన పేరు మీద ఉన్న ఇంటిని కొడుకు పేరున రిజిస్టర్ చేయించానని తన భార్య చనిపోయిన తర్వాత తనను చూడటం లేదని తన ఇంటిని తిరిగి తనకు రిజిస్ట్రేషన్ చేయించాలని పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన గునుపూడి జోగిరాజు అర్జీ సమర్పించారు. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు వచ్చిన కారణంగా పెన్షన్ నిలుపుదల చేశారని వితంతు పెన్షన్ పునరుద్ధరించాలని భీమవరానికి చెందిన కొంబోతుల కస్తూరిబాయి కోరారు. తనకు 52 సెంట్లు పొలం ఉందని సరిహద్దు రైతు పంటబోదె పూడ్చడం వల్ల రెండు సెంట్లు భూమి కోల్పోయానని తన భూమికి సరిహద్దులు చూపించాలని వీరవాసరం మండలం రాయకుదురు గ్రామానికి చెందిన దుండి మంగమ్మ కోరారు.

వాస్తవాలైతే చర్యలు తీసుకోండి : ఎస్పీ

భీమవరం క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సోమవారం అర్జీలను స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత సమస్యలపై పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులో అంశాలను పరిశీలించి వాటి పూర్వపరాలను విచారణ చేసి వాస్తవాలైతే చట్టపరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. మొత్తం ఎనిమిది ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న ఎస్పీ నయీం అస్మి

రోడ్ల అభివృద్ధికి రూ.13.40 కోట్లు మంజూరు

భీమవరం టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు రోడ్ల అభివృద్ధికి రూ.13.40 కోట్లు నాబార్డు నిధులు మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో 37.020 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి రూ.13.40 కోట్లు మంజూరు చేశామన్నారు. దిరుసుమర్రు-హెచ్‌డబ్ల్యు కోమటి తిప్ప రోడ్డు, కోలమూరు- కొండేపాడు, కలిగొట్ల -ఉండ్రు రోడ్డు 8.17 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.2.50 కోట్లు, పూలపల్లి-అగర్తిపాలెం రోడ్డు 8.60 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.3.70 కోట్లు, కవిటం- ఓడూరు, యలమంచిలి -శాజా రోడ్డు 4.41 కిలో మీటర్ల మేర అభివృద్ధికి రూ.1.70 కోట్లు, నరసాపురం -మొగల్తూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులోని పాతకాలవ సెంటర్, కొప్పర్రు టు శేరేపాలెం వద్ద రాజుగారి తోట, పలకమ్మ చెరువు నవుడూరివారి గూడెం మీదుగా 6.54 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.2.50 కోట్లు, ఉరదాళ్లపాలెం -దువ్వ, మార్టేరు- వడలి, వీరవాసరం-శృంగవృక్షం రోడ్డు 9.3 కిలోమీటర్ల పరిధిలో అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు చేశామని త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి పనులు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

కలెక్టర్‌కు రెడ్‌క్రాస్ అవార్డు

మానవీయ సేవల్లో మెరుగైన పనితీరుకు గుర్తింపుగా కలెక్టర్ నాగరాణి ఇండియన్ రెడ్ క్రాస్ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఇటీవల ముంచెత్తిన వరదలలో ప్రజానీకాన్ని ఆదుకునే ప్రయత్నంలో నాగరాణి చేసిన కృషికి గుర్తింపుగా 2024, 2025 సంవత్సరాలకు రెడ్ క్రాస్ ఈ అవార్డును ప్రకటించింది.ఈనెల 8న విజయవాడ రాజ్‌భవన్ హాల్‌లో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా కలెకర్ పురస్కారం అందుకోనున్నారు.

లక్ష్యం పెరిగేనా?

ఆచంటలో తడిచిన ధాన్యాన్ని ఎండ బెట్టుకుంటున్న రైతులు



ధాన్యం కొనుగోళ్లకు మరో వారమే గడువు

జిల్లాలో పూర్తి కానున్న లక్ష్యం..

ఆరు లక్షల టన్నుల సేకరణకు సర్వసన్నద్ధం

ఇప్పటికే 4.60 లక్షల టన్నులు కొనుగోలు ..మరో 1.50 లక్షల టన్నులకు ప్రతిపాదన

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : రబీలో వాతావరణం అనువుగా ఉందన్న ధీమా రైతుల్లో సడలిపోయింది. ఒక్కరోజు రెండు గంటలపాటు ఏకబిగిన కురిసిన వర్షంతో రైతులు బెంబేలెత్తిపోయారు. తర్వాత వాతావరణం పొడిగా ఉండడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. అయినా సరే వాతావరణ హెచ్చరికలతో గడగడలాడిపోతున్నారు. ధాన్యాన్ని విక్రయించుకోవడానికి పెద్ద ప్రయత్నాలే చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 4.60 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతుల ఖాతాల్లో మొత్తం సొమ్మును జమ చేశారు. మరో 1.50 లక్షల టన్నుల ధాన్యం రైతుల వద్ద నిల్వ ఉంది. వాటిని ఆరబెట్టే పనిలో నిమగ్నమయ్యారు. వారం వ్యవధిలోనే ఆ మొత్తాన్ని రైతుల నుంచి సేకరించనున్నారు. ప్రాథమికంగా రబీలో ఆరు లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సంకల్పించారు. వేగవంతంగానే కొనుగోలు ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఖరీఫ్‌లో రైతులే మిల్లును ఎంపిక చేసుకునే విధానాన్ని అమలులోకి తెచ్చారు. ఈసారి లారీ లోడ్ అయిన తర్వాత తెలుస్తోంది. వాహనాలకు జీపీఎస్‌ను ఏర్పాటుచేశారు. ఇది కాస్త రైతులను తికమకపెడుతోంది. అయినా సరే కొనుగోళ్ల సజావుగానే సాగుతున్నాయి. ఒకేసారి పంట చేతికి రావడంతో కాస్త జాప్యం అవుతోంది. మరోవైపు కొన్ని మండలాల్లో సంచుల ఇబ్బంది వెంటాడింది. దానిని అధిగమించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు తొలుత అనుకున్న లక్ష్యాన్ని పూర్తయితే పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. గత ఏడాది 6.40 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుత రబీలో దిగుబడులు అధికంగా వచ్చాయి. దీంతో లక్ష్య ఛేదనలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మొత్తంగా 7.50 లక్షల టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు

ప్రస్తుతం కళ్లాల్లోనూ, రోడ్లపై రాశుల రూపంలోను వున్న ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఇబ్బంది లేదు. ఆ మొత్తాన్ని కొనుగోలు చేస్తే జిల్లాలో ఆరు లక్షల టన్నుల సేకరణ పూర్తవుతుంది. మిగిలిన ధాన్యం కొనుగోలు విషయంలోనే రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో అదనంగా మరో 1.50 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అనుమతి ఇవ్వాలని పౌరసరఫరాల కార్పొరేషన్‌కు జిల్లా నుంచి లేఖ రాశారు. అనుమతి వస్తే అదనపు ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. సకాలంలో స్పందించకపోతే జిల్లాలో రైతులతోపాటు, అధికారులు ఇబ్బంది పడనున్నారు. కోత దశలో గరిష్టంగా 60 వేల ఎకరాల్లో పంట ఉంది. ఆ మొత్తంలో 1.50 లక్షల టన్నులు దిగుబడి వస్తుందని అంచనాతో ఉన్నారు. ఆ మేరకే పౌరసరఫరాల కమిషనర్‌కు జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపారు. కమిషనరేట్ స్థాయిలో అనుమతులు రావడం జాప్యం జరుగుతోంది. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులను పరిగణలోకి తీసుకోవడం లేదు. సంచుల విషయంలోనూ అదే జరుగుతోంది. ఉన్నతాధికారుల్లో స్పష్టత కొరవడింది. దాంతో అధికారులు, రైతులు, రవాణా చేసే కాంట్రాక్టర్‌లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు కూడా అదే జరగనుంది. ఏలూరు జిల్లాలో లక్ష్యం పూర్తయిందని కొనుగోళ్లు నిలిపివేశారు. జిల్లాలో అటువంటి దుస్థితి లేకుండా ఉండాలంటే నాలుగు రోజుల్లోనే అనుమతులు రావాలి. లేదంటే రైతులు రోడ్డెక్కనున్నారు. అంతిమంగా ప్రభుత్వం ఇరకాటంలో పడనుంది.

పెరిగిన ధాన్యం అమ్మకాలు

భీమవరం రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): నుకోకుండా వచ్చిన భారీ అకాల వర్షం రైతులను ఇబ్బంది పెట్టడంతోపాటు మిగిలిన పంట మాసూళ్ల స్పీడ్‌గా చేసేలా మార్చింది. సోమవారం పంట మాసూళ్లలో రైతులు జోరు పెంచారు. వారి కోత యంత్రాలతో ధాన్యం గట్టుకు చేర్చే పనిలో పడ్డారు. మరోపక్క ధాన్యం అమ్మకాలు సాగించారు. తడిచిన రాశుల కింద ధాన్యం ఎండబెట్టారు. మరో వారం రోజుల్లో పూర్తిగా మాసూళ్లు పూర్తి కావాలనే ఆలోచనతో రైతులు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే లక్షా 70 వేల ఎకరాల్లో పంట మాసూళ్లు అయ్యింది. మిగిలిన 45 వేల ఎకరాలు నాలుగైదు రోజుల్లో అయిపోతాయని అధికారులు లెక్కలు వేస్తున్నారు. ధాన్యం కొనుగోలు స్పీడ్‌గా జరుగుతున్నందున రైతులు అమ్మకాలు అదే స్పీడ్‌గా చేస్తున్నారు.

తడిచిన ధాన్యం కొనుగోలుకు చర్యలు : కలెక్టర్

భీమవరం టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : వర్షాలతో పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని, మంగళవారం సాయంత్రం లోపుగా పరిహారం అందజేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సీఎం సోమవారం సచివాల యంలో వ్యవసాయ, విపత్తుల నిర్వహణ అధికా రులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ నాగరాణి పాల్గొన్నారు. పంటనష్టాన్ని వెంటనే అంచనా వేసి నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పిడుగుపాటుకు గురై చనిపోయిన 8 మంది బాధితుల కుటు ంబాలకు పరిహారం కూడా తక్షణమే అందించా లని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2,791 ఎకరాల్లో వరి పంట నేలకు ఒరిగిందన్నారు. 9 ఎకరాల్లో అరిటి తోటలు దెబ్బతిన్నా యన్నారు.ధాన్యం కొనుగోల్లో ఎటువంటి ఇబ్బందిలేదని, రంగు మారిన తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చెయ్యాలని మిల్లర్లకు సూచించామన్నారు.

పైప్‌లైన్ పనులకు మోక్షం

ఆకివీడు, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అరవై గ్రామాల్లో ఏళ్ల తరబడి ఉన్న తాగునీటి సమస్య ఎట్టకేలకు పరిష్కారమవుతోంది. వెంకయ్య వయ్యేరు పంట కాలువకు సమాంతరంగా రూ.30 కోట్లతో చేపట్టిన పైప్‌లైన్ పనులు డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు ఇటీవల పునఃప్రారంభించారు. గణపవరం, నిడమర్రు, ఆకివీడు, కాళ్ల మండలాల పరిధిలో అనేక గ్రామాల్లో చెరువులకునేరుగా గోదావరి జలాలను సరఫరా చేసేందుకు 2006లో రూ.30 కోట్లు వ్యయంతో ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసేందుకు భారీ పైపులైన్ ప్రాజెక్టు అప్పటి ప్రభుత్వం చేపట్టింది. పెంటపాడు మండలం పరిమెళ్ల లాకుల వద్ద వెంకయ్య వయ్యేరు కాలువ నీటిని 3.50 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులోకి ఎక్కించి, అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా గ్రామాల్లోని మంచినీటి చెరువులకు పంపించి ప్రజల గొంతు తడపాలన్నది ప్రాజెక్టు ముఖ్యఉద్దేశం. మొదటి దశలో 22, రెండో దశలో 20, మూడో దశలో 18 గ్రామాలకు తాగునీరు అందేలా పైపులైన్ నిర్మించాల్సి ఉంది. మొదటి దశలో పెంటపాడు మండలం పరిమెళ్ల లాకుల నుంచి ఆకివీడు మండలం తరటావ వరకూ రూ.10 కోట్లతో నిర్మాణం పూర్తిచేశారు. రెండో దశలో తరటావ నుంచి కాళ్ల మండలం ఏలూరుపాడు వరకూ రూ.8 కోట్లతో ప్రధాన పైప్‌లైన్ నుంచి గ్రామాలను అనుసంధానం చేస్తూ పైపులైన్ల నిర్మాణం, ఓహెచ్ఎస్ఆర్, సంప్‌ల నిర్మాణం పనులు దాదాపు పూర్తయింది. నిడదవోలు కాలువ నుంచి పరిమళ్ల లాకుల వరకూ ఉన్న ప్రధాన పంట కాలువ నుంచి వెంకయ్య వయ్యేరు పంట కాలువకు వచ్చే నీరు కూడా కలుషితమవ్వడంతో నేరుగా పైపుల ద్వారా నీరు సరఫరా చేసేందుకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతో కలిసి డిప్యూటీ స్పీకర్ పరిమెళ్ల పంపింగ్ పథకం వద్దకు వెళ్లి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి పరిస్థితిని తెలుసుకున్నారు. మరమ్మత్తులకు జిల్లా పరిషత్ నిధులు రూ.61 లక్షలు మంజూర్ చేయించారు. కొద్ది రోజులుగా ట్రయల్ రన్ కొనసాగిస్తూ బయటపడ్డ లోపాలను గుర్తించి వెనువెంటనే మరమ్మత్తులు చేస్తూ ముందుకు సాగుతున్నారు.



పైపులైన్‌లను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి

నరసాపురం కౌన్సిల్ గరం.. గరం

టెండర్ల జాప్యంపై సభ్యుల ఆగ్రహం





మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వెంకటరమణ.. సభ్యులు

నరసాపురం, మే 5(ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులకు సంబంధించి పిలిచిన టెండర్లు, పనుల అంచనా ఎక్కువుగా వేయడంపై సోమవారం జరిగిన నరసాపురం కౌన్సిల్ అత్యవసర సమావేశం రసాభాసగా సాగింది. టీడీపీ, స్వతంత్ర, వైసీపీ సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవా లంటూ పట్టుబట్టారు. సమావేశం ప్రారంభం కాగానే స్వతంత్ర సభ్యుడు కోటిపల్లి సురేష్ అజెండాలోని అంశాలపై ప్రస్తావిం చారు. సభ్యులకు పంపిన కాపీలోని తప్పులను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సిల్ట్ పనుల టెండర్ల కీని 12 రోజుల వరకు ఎందుకు తెరవలేదంటూ కేసరి గంగరాజు నిలదీశారు. టెండర్లు తెరిచి బిడ్ ధర వివరాలను బహిర్గతం చేయకుండా గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఎందుకు వచ్చిందంటూ ప్రశ్నించారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది. ఇదే అంశంపై వైసీపీ సభ్యుడు సఖినేటిపల్లి సురేష్, శ్రీకాంత్ కన్నా, టీడీపీ సభ్యుడు పాలూరి బాబ్జీలు నిలదీశారు. దీనికి జనసేన సభ్యులు అరుణ, కృష్ణవేణి, సూర్య కుమారి, సురేష్‌లు అభ్యంతరం తెలిపారు. పనులు జరగనివ్వాలని విన్న వించగా తాము పనులకు వ్యతిరేకం కాదని, నిబంధనలు తుంగలోకి తొక్కారని సభ్యులు ప్రతి దాడికి దిగారు. వీసీ కొత్తపల్లి నాని మాట్లాడుతూ వర్షాలు పడే సమయంలో పనులు ఎలా చేపడతారని, గత ఏడాదికి ఇప్పటికి అంచనా విలువ ఎందుకు పెరిగిందని ప్రశ్నించారు. టెండర్ల కీ జాప్యంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. డీఈ ప్రవీణ్ టెండర్ల ఓపె నింగ్ జరిగిన తీరును సభ్యులకు వివరించారు. కమిషనర్ అంజయ్య వల్లే జాప్యం జరిగిందని తేలడంతో చర్యలు తీసుకోవాలని సభ్యులు పట్టుబట్టారు. కమిషనర్‌కు మెమో ఇస్తామని చైర్‌పర్సన్ చెప్పడంతో సభ్యులు శాంతించారు.

2027 నాటికి పోలవరం పూర్తి

» మాజీ మంత్రి పీతల సుజాత

అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును 2027 గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలనే ధ్రుఢ సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని, నిర్మాణ పనులను పరుగులు పెట్టిస్తున్నారని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో సుజాత మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పోలవరం ప్రాజెక్టు ఒక కలగానే మిగిలిపోతూ వస్తోందని, చంద్రబాబు సంకల్ప బలంతో పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడం ఖాయమన్నారు. వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుపై చాలా నిర్లక్ష్యం వహించిందని, వైసీపీ హయాంలో పోలవరం నిర్మాణానికి కేటాయించిన నిధుల్ని దారి మళ్లించారని, రివర్స్ టెండరింగ్ ద్వారా రూ.25 వేల కోట్ల వ్యయభారాన్ని మోపారని విమర్శించారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు పోలవరం పనులు సక్రమంగా చేసి ఉంటే ఈపాటికే ప్రాజెక్టు పూర్తయ్యేదని సుజాత అన్నారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఎన్‌టీఎన్‌ఎల్ పరీక్షలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

నూజివీడు టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల్లో శాస్త్రసాంకేతిక రంగంలో మరింత మెలకువలు పెంచేదిశగా నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్‌పై పరీక్ష నిర్వహించారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థులు 10,300మంది పరీక్షలకు హాజరైనట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఐఐటీలు, ఐఐఎస్‌సీ లాంటి దేశవాళి, ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల భాగస్వామ్యంతో భారత మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ పరీక్షలకు ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, శ్రీకాకుళం, ఆర్కేవాలీ, ఒంగోలు క్యాంపస్‌ల నుంచి తృతీయ, ఆఖరి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి రూపొందించిన ఈ కోర్సులు ప్రత్యేకమని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరిన్ని కోర్సులను అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన తెలిపారు.



తాడేపల్లిగూడెంలో గ్రామోత్సవంలో వేద విద్యార్థులు

తాడేపల్లిగూడెంలో వేద పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్, మే5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లా వేద పరీక్షలు తాడేపల్లిగూడెం పట్టణంలోని శంకర మఠం వద్ద సోమవారం నిర్వహించారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి భారీగా వేద విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం కూడా పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలను వేద శాస్త్ర, శ్రౌత, స్మార్త, ఆగమ, అపర విద్యలలో గురువులు పరీక్షించారు. వేద విద్యార్థులు వారి ప్రతిభను ప్రదర్శించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సందర్శించి వేద మంత్రోచ్చరణలతో మార్మోగుతున్న ప్రాంగణం ఇలానే భాసిల్లాలని ఆకాంక్షించారు. వేద పరీక్షలు నిర్వహిస్తున్న వారికి ఆయన సొంత నిధులతో రూ.35వేలు ప్రోత్సాహకం అందించారు.



ఎంపీకి సమస్యలు వివరించిన పేరంటాలపల్లి నిర్వాసితులు

గోదావరిపై 30 కిలో మీటర్ల ప్రయాణం

ఎంపీకి సమస్యలు వివరించిన మహిళా నిర్వాసితులు

పోలవరం, మే 5: నడి నెత్తిన మండుతున్న ఎండలో ఆరుగురు గిరిజన మహిళలు గోదావరిపై 30 కిలో మీటర్ల పడవలో ప్రయాణం చేశారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు పర్యటనలో ఉన్న ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్‌ను కలిసి తమ సమస్యలు మొరపెట్టుకున్నారు. వేలేరుపాడు మండలం పేరంటాలపల్లి గ్రామానికి చెందిన తమకు ఆర్ అండ్ ఆర్ పరిహారాలు ఇంకా అందలేదని, తమకు ఇష్టంలేని, అందుబాటులో లేని దొరమామిడి గ్రామంలో పునరావాస కాలనీలు కేటాయించారని తెలిపారు. తమకు జీలుగుమిల్లి మండలంలో పునరావాసాలు కేటాయించాలని ఎంపీ మహేశ్‌కు వినతిపత్రం అందించినట్లు పేరంటాలపల్లి గ్రామ మహిళలు తెలిపారు. పేరంటాలపల్లి గ్రామం నుంచి మర పడవపై పోశమ్మగండికి చేరుకున్నామని, అక్కడి నుంచి ఆటోలో పోలవరం ప్రాజెక్టు వద్దకు వెళ్లినట్లు గిరిజన నిర్వాసిత మహిళలు తెలిపారు. ఆకలితో ఉన్న పేరంటాలపల్లి నిర్వాసిత గిరిజన మహిళలకు మెగా ఇంజనీరింగ్ అధికారులు భోజనం పెట్టించి పంపించారు.

చిన వెంకన్నను దర్శించుకున్న

బుల్లితెర నటి సుహాసిని



బుల్లితెర నటి సుహాసిని

ద్వారకాతిరుమల, మే 5(ఆంధ్రజ్యోతి): నటనతో పాటు అదృష్టం కలిసివస్తేనే చలనచిత్ర రంగంలో రాణిస్తారని చలనచిత్ర, బుల్లితెర నటి సుహాసిని అన్నారు. చిన వెంకన్న ఆలయాన్ని సోమవారం ఆమె సం దర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శిం చుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెను గుర్తించిన పలువురు భక్తులు ఆమెతో ఫొటో లు దిగారు. 2003లో బిజయ దర్శకత్వంలో రూపొందిన చంటి సినిమాతో చిత్ర రంగప్రవేశం చేసినట్లు చెప్పారు. ఆతరువాత తెలుగు, తమిళ, కన్నడ సినిమాల్లో నటిం చానన్నారు. ఆ తరువాత తెలుగు, తమిళ బుల్లితెర సీరియల్స్‌లో నటించానన్నారు. 2010లో అపరంజి ధారావాహిక ద్వారా బుల్లితెరలో ప్రవేశించి ఎన్నో హిట్ సీరియల్స్ చేసినట్లు చెప్పారు.

భక్తులతో కిటకిటలాడిన నత్తా రామేశ్వరం



స్వామివారికి అభిషేకం

పెనుమంట్ర, మే 5 (ఆంధ్రజ్యోతి): నత్తా రామేశ్వరం సప్త కోటి రామలింగేశ్వర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. 11 నెలలు నీటిలో ఉండి వైశాఖ మాసంలో దర్శనమిచ్చే శివలింగాన్ని పూజించేందుకు సోమవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రామలింగేశ్వర శర్మ, కాశీభట్ల సూర్యనారాయణమూర్తి, భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ఏకదశ రుద్రాభిషేకం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. దాతల సహకారంతో ప్రసాద వితరణ, అన్న సమారాధన నిర్వహించినట్లు ఆలయ ఈవో వేణుగోపాల్ తెలిపారు.

శ్రీనివాస కల్యాణం చూతము రారండి

రేపటి నుంచి చిన వెంకన్న తిరు కల్యాణ మహోత్సవాలు





శేషాచలంపై చిన వెంకన్న వైశాఖ మాస బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యాడు.. బుధవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయంలో వైఖానస ఆగమంలో పాంచాహ్నిక దీక్షతో ఏటా రెండుసార్లు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 7 నుంచి 14 వరకూ కల్యాణోత్సవాలు జరగనున్నాయి.

» తొలిరోజు వధూవరులుగా స్వామి, అమ్మవార్లు

» 11న శ్రీవారి కల్యాణం

» 12న రథోత్సవం

ద్వారకాతిరుమల, మే 5(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లను వధూవరులను చేస్తారు. 8న ధ్వజారోహణ, 10న ఎదుర్కోలు ఉత్సవం, 11న రాత్రి 8.30 గంటలకు శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 12న రాత్రి 7.30 గంటలకు రథోత్సవం, 13న శ్రీచక్ర వార్యుత్సవం, ధ్వజావరోహణ, 14న చూర్ణో త్సవం, వసంతోత్సవం, రాత్రి ద్వాదశ కోవెల ప్రదక్షిణ, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

వాహన సేవలు..

బ్రహ్మోత్సవ సమయంలో స్వామి, అమ్మవార్లకు నిత్యం జరిగే వాహన సేవల నిమిత్తం వివిధ రకాల వాహనాలను సిద్ధం చేస్తున్నారు. రోజుకో వాహనంలో అమ్మవార్లతో కలసి శ్రీవారు వివిధ అలంకారాల్లో ఊరేగుతారు. 7న రాత్రి గజ వాహనం, 8న హంస వాహనం, 9న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనం, 10న ఉదయం హనుమంత వాహనం, రాత్రి వెండి శేష వాహనం, 11న రాత్రి శ్రీవారి కల్యాణం అనంతరం వెండి గరుడ వాహనంపై స్వామివారి తిరువీధి ఉత్సవాలు నిర్వహిస్తారు. 12న స్వామివారి రథోత్సవం, 13 రాత్రి అశ్వవాహనంపై గ్రామోత్సవం జరుగుతుందని ఈవో వివరించారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

నిత్యార్జిత కల్యాణాలు, సేవలు రద్దు

ఉత్సవాలు జరిగే రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలు, సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. 15 నుంచి అన్ని సేవలు యధావిధిగా పునరుద్ధరిస్తామని భక్తులు గమనించాలని కోరారు. కల్యాణ మహోత్సవాలను వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మంగళవారం రాత్రికి అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తవుతాయి. అదనపు క్యూలైన్లు, విద్యుద్దీప అలంకారాలు చేస్తున్నట్లు వివరించారు

దేవదాయ మంత్రికి ఆహ్వానం



మంత్రిని ఆహ్వానిస్తున్న ఆలయ ఈవో, అర్చకుడు

ఈనెల 11న చిన వెంకన్న కల్యాణోత్సవానికి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. సోమవారం మంత్రి నివాసానికి వెళ్లి వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం శ్రీవారి శేషవస్త్రం, కల్యాణ పత్రిక, ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని మంత్రికి ఈవో సత్యనారాయణమూర్తి, అర్చకులు భాను అందించారు.

నేటి నుంచి కాళ్లకూరు

వేంకన్న కల్యాణోత్సవాలు



కాళ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి సప్తాహ్నిక తిరుకల్యాణ మహోత్సవాలు ఈ నెల 6 నుంచి 14 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎం. అరుణ్‌కుమార్ సోమవారం తెలిపారు. 8వ తేదీ రాత్రి 7.30 గంటలకు డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు దంపతులు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారన్నారు. 12న సాయంత్రం స్వామివారి దివ్య రథోత్సవం జరపనున్నట్లు తెలిపారు. కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన స్పష్టం చేశారు.

ముఖం చాటేశారా..

తప్పించుకోలేరు!



» ఉమ్మడి జిల్లాలో 11 మంది వైద్య సిబ్బందిపై చర్యలకు ఆదేశాలు

» 8 మంది పీహెచ్‌సీ వైద్యాధికారులే!

» ఫోన్ సెట్టింగ్స్‌తో టాంపరింగ్

» వారిపై కఠిన చర్యలు

హెల్త్ ఎఫ్ఆర్ఎస్ యాప్ హాజరు నమోదులో అవకతవకలు

ఏలూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): వైద్య శాఖలో హాజరు నమోదులో అవకతవకలు వెలుగు చూశాయి. వైద్యాధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఆరోగ్యశాఖ అమలు చేస్తున్న ముఖ గుర్తింపు ఆధారిత(ఎఫ్ఆర్ఎస్) హెల్త్ యాప్‌లో తప్పుడు సమాచారాన్ని నమోదు చేశారనే అభియోగాలపై ఉమ్మడి పశ్చిమలో 11 మందిపై చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు 8మంది, ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఒక గ్రేడ్-2 ఫార్మసిస్టు, ఒక గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నారు. ప్రతీరోజు ఉదయం వారికి కేటాయించిన కార్యస్థానాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ హాజరును విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్లాల్సివస్తే వివరాలను నిర్ణీత బుక్‌లో నమోదు చేస్తే పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ధ్రువీకరిస్తారు. దీనికి భిన్నంగా కొందరు పీహెచ్‌సీ ప్రధాన కార్యస్థానాలకు వెళ్లకుండా, అనుబంధ సబ్ సెంటర్లను మ్యాపింగ్ చేసుకోవడం, ఆ ప్రాంతంలోకి రాగానే హాజరు నమోదు చేసుకుని వెళ్లిపోతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

గతనెల 10న ఎఫ్ఆర్ఎస్ స్టేట్ నోడల్ ఆఫీసర్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో ముఖగుర్తింపు ఆధారిత హాజరు నమోదు పరిశీలించారు. పలు పీహెచ్‌సీల్లో ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు ఐఫోన్ల ద్వారా డేట్, టైం సెట్టింగ్‌లను ట్యాంపరింగ్ చేసి తప్పుడు సమాచారాన్ని నమోదు చేస్తున్నట్టు గుర్తించారు. తప్పుడు మార్గంలో హాజరు నమోదు చేయడం ద్వారా తమ కార్యస్థానాలకు హాజరుకావడంలో కొందరు బురిడీ కొట్టిస్తున్నట్టు గమనించారు. యాప్‌లో తప్పుడు సమాచారాన్ని నమోదు చేస్తున్నారని సర్వీస్ ప్రొవైడర్ అందజేసిన వివరాలతో నిర్ధారణకు వచ్చారు. ఇలా ఒకటి నుంచి గరిష్ఠంగా మూడు దఫాలు ట్యాంపరింగ్‌కు పాల్పడినట్టు తేల్చారు. దీంతో గత నెలలోనే సంబంధిత ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ, ఆ వెంటనే వివరణ ఇవ్వడం జరిగిపోయాయి. హాజరు నమోదులో మాల్‌ప్రాక్టీస్ విధానాలకు చెక్‌పెట్టాలని నిర్ణయించిన ఉన్నతాధికారులు తాజాగా కఠిన చర్యలకు ఉపక్రమించారు.

ఎల్ఎన్‌డీ పేట, ముదినేపల్లి, పీఆర్.గూడెం, పూళ్ల, రాఘవాపురం, తాడువాయి, పెనుగొండ, మార్టేరు పీహెచ్‌సీల్లో కొందరు వైద్యాధికారులతో పాటు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్టు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్(హెచ్‌డబ్ల్యుసీ)లో మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)లపై తదుపరి చర్యలకు ఆదేశించారు. వీరిలో రెగ్యులర్‌ప్రాతిపదికన పనిచేసేవారిపై సీసీఏ రూల్స్‌ప్రకారం క్రమశిక్షణచర్యలు, కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసేవారిని విధులనుంచి తొలగించి, ఆ సమాచారాన్ని రాష్ట్ర కార్యాలయానికి తెలియజేయాలని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశించారు.

విధుల నుంచి తొలగించారు..?

హాజరులో ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను విధులనుంచి తొలగిస్తూ జిల్లా అధికారి ఉత్తర్వులు జారీచేసినట్టు సమాచారం. మిగతావారిపై చర్యలకు ఆచితూచి వ్యవహరిస్తున్నట్టుగా ప్రచారం జరుగుతోంది. కఠినచర్యలు తీసుకోకుండా ఉన్నత స్థాయిలో పైరవీలు, లాబీయింగ్ జరుగుతున్నట్టుగా సమాచారం. తొలి తప్పుగా పరిగణించి వదిలేయాలని, ఇకమీదట ఇలా జరుగబోదని పలువురు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది.

ఉన్నతాధికారుల ఆదేశాలు అందాయి..

హాజరు ట్యాంపరింగ్‌పై చర్యలకు ఉన్నతాధికుల నుంచి ఆదేశాలు అందాయి. వాటిని ఇంకా చదవలేదు. పూర్తి వివరాలు తెలీదు. జిల్లాకు చెందిన వారెవరైనా ఉన్నారనే దానిపై కార్యాలయ సెక్షన్ సిబ్బంది నుంచి వివరాలను తీసుకుంటా.

- డాక్టర్ మాలిని, జిల్లా వైద్యాధికారి

అగ్రిగోల్డ్ ఆస్తుల వేలానికి

జిల్లా స్థాయి కమిటీ

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

ఏలూరు, మే 5(ఆంధ్రజ్యోతి): స్పెషల్ కోర్టు ఏలూరు ఉత్తర్వులు, ప్రభుత్వ జీవో నెంబర్ 519 ప్రకారం అగ్రిగోల్డ్ ఆస్తులను వేలం వేయడానికి జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటుచేస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులను జారీ చేశారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డీవోలు, జిల్లా రిజిస్ట్రార్, డీపీఆర్వో, జిల్లా ఐటి అధికారి (డీఐవో, ఎన్ఐసీ), సీఐడీ ఏఎస్పీ, నగరపాలకసంస్థ ఏవో, ఏలూరు స్పెషల్‌కోర్టు అగ్రిగోల్డ్ సూచించిన పేర్ల సీతారామస్వామిని ఆథరైజ్డ్ మెంబర్‌గా జిల్లా స్థాయి కమిటిని నియమిస్తూ ఉత్తర్వులను కలెక్టర్ ఇచ్చారు. సీఐడీ అదనపు ఎస్పీ కమిటీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఏలూరు అర్బన్, ద్వారకాతిరుమల మండలం తహసీల్దార్, జిల్లా స్థాయి కమిటీకి, పోలీస్, సీఐడీ దర్యాప్తు ఏజెన్సీలకు విచారణ సమయంలో వారికి సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు ఎక్కడ ఉన్నాయో పరిశీలించడం, అధీకృత సంస్థల నుంచి సరమైన మార్కెట్ ధర సేకరించడం, అగ్రిగోల్డ్ భూములు రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్ చేయడం, జిల్లా స్థాయి కమిటీ విధులుగా తెలిపారు.

ఊపిరి తీసే ఉబ్బసం



అకస్మాత్తుగా దగ్గు, జలుబు, ఆయాసం, ఊపిరి పీల్చుకోడానికి ఇబ్బంది ఉంటే కచ్చితంగా ఉబ్బసం (తీవ్రమైన శ్వాసకోశ వ్యాధి) అని గుర్తించవచ్చు. శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గినప్పుడు ఈ వ్యాధి బారినపడతారు. దుమ్ము, ధూళి, పరిసరాల పరిశుభ్రత లేకపోవడం, గాలిలో తేమ శాతం తక్కువగా ఉన్నప్పుడు ఈ వ్యాధి బయటపడుతుంది. ఉమ్మడి పశ్చిమలో 10 వేల మంది ఆస్తమా బాధితులు అంచనా. ఈ వ్యాధిపై అవగాహన కల్పించడానికి ఏటా మే మొదటి మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఒకొక్క నినాదంతో ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఇన్హేల్డ్ ట్రీట్మెంట్ (పీల్చే మందులు) అందరికి అందుబాటులో ఉండేలా చేయండి అనే నినాదంతో మంగళవారం ప్రపంచ వ్యాప్తంగా ఆస్తమా దినం నిర్వహిస్తున్నారు.

ఏలూరు క్రైం/పోలవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉబ్బసంగా పిలిచే ఆస్తమా ఊపిరి ఆపేసేంత ప్రమాదకారి. తగ్గినట్లు అనిపించినా మరోసారి తిరగబెడుతుంది. అందుకే వైద్యులు దీనిని వచ్చిపోయే జబ్బు అని చెబుతారు.


ఆస్తమా లక్షణాలు

- ఊపిరితిత్తుల్లో నాళాలు ఇన్‌ఫెక్షన్‌తో ఉబ్బిపోవడం వల్ల లోపలి భాగం సన్నబడి గాలిపీల్చుకోవడం కష్టతరంగా అవుతుంది.
- హైపర్ రియాక్షన్‌తో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతుంది.
- వాతావరణంలో దుమ్ము, ధూళి, చల్లని వాతావరణం, అపరిశుభ్రత వాతావరణం, దుర్గంధం, మొక్కలపై పుప్పొడి, జంతువుల వెంట్రుకలు వల్ల శ్వాస నాళాలు కుచించుకుపోయి ఊపిరి పీల్చుకోవడం కష్టతరం అవుతుంది.
- దగ్గు, ఆయాసం, కఫంతో ఊపిరి పీల్చుకోవడం భారంగా మారుతుంది.

చికిత్సా విధానం

వాయుకాలుష్యం, చల్లనిగాలి, దుర్గంధ వాసనలకు దూరంగా ఉండాలి. అలర్జీలేకుండా చూసుకోవడం, సిగరెట్లు, బాణసంచా, కొవ్వొత్తులు, పొగకు దూరంగా ఉండడం. అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు (జలుబు లేదా ఫ్లూ) దూరంగా ఉండడం. పరిసరాల్లో దుమ్ము, ధూళి లేకుండా చూసుకోవడం. న్యూమోనియా, డిఫ్తీరియా, ధనుర్వాతం, జోస్టర్ వ్యాక్సిన్, గోరింత దగ్గును నివారించడానికి సకాలంలో టీకాలు వేయించడం, ఆస్తమా మందులను క్రమం తప్పకుండా వినియోగించడం.

జాగ్రత్తలతోనే వ్యాధికి దూరం



దగ్గు, ఆయాసం రోజులు తరబడి ఉంటే పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ (పీఎఫ్‌టీ) ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించవచ్చు. అన్ని కాలాల్లో దగ్గు, ఆయాసం, పిల్లికూతలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాతీ ఎక్స్‌రే ద్వారా ప్రాథమికంగా గుర్తించవచ్చు. మద్యపానం, ధూమపానం చేసేవారిలో బ్రాంకైటిస్ వస్తుంది. ఇళ్లలో బూజులు, ఇళ్ల వద్ద ఉన్న చెట్ల పూసే పూల పుప్పొడి వల్ల, కూల్‌డ్రింక్‌లు తాగడం, ఏసీలో ఎక్కువగా ఉండడం వల్ల ఈ వ్యాధికి గురవుతుంటారు. డెర్మిఫిలిన్, యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్, నోటి ద్వారా పీల్చే మందులు తీసుకుంటారు. పీల్చే మందుల వల్ల ఎలాంటి దుష్పరిణామాలు ఉండవు. వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే పౌష్టికాహారం తీసుకోవాలి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని అదుపు చేయవచ్చు. రోజుల తరబడి వైద్యం పొందకుంటే ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. అన్ని వేళలా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యం.

- డాక్టర్ తోకల సికింద్రమోహన్, ప్రభుత్వ వైద్య కళాశాల, ఏలూరు

అగంతకుడి మాటలు నమ్మి..

వెళ్లిపోయారు

» బాలికల అమాయకత్వం

» పోలీసులనాశ్రయించిన తల్లిదండ్రులు

» మూడు గంటల్లో ఆచూకీ కనిపెట్టారు

ఏలూరు క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసిన ఇద్దరు బాలికలు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై అగంతకుడి మాటలు నమ్మి ఇంటి నుంచి వెళ్లిపోయారు. తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో తప్పిపోయిన బాలికలను మూడు గంటల వ్యవధిలో ఏలూరు టూటౌన్ పోలీసులు తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని ఇద్దరు బాలికలు పక్కపక్క ఇళ్లలో నివాసముంటున్నారు. వారికి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకడు పరిచయం అయ్యాడు. అతడి మాటల మాయలో పడిన బాలికలు ఇంటి నుంచి వెళ్లిపోయారు. వారి కోసం తల్లిదండ్రులు వెతికినప్పటికి ఆచూకీ లేకపోవడంతో సోమవారం సాయంత్రం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేయగా డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి అత్యాధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి తప్పిపోయిన ఇద్దరు బాలికలను మూడు గంటల వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం తల్లిదండ్రులకు బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ అగంతకులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు.

బీచ్‌లో గల్లంతైన యువకుడి

మృతదేహం లభ్యం

మొగల్తూరు, మే5 (ఆంధ్రజ్యోతి): పేరుపాలెం సాగర తీరానికి వచ్చిన యువకుడు సముద్ర స్నానానికి దిగి గల్లంతయ్యాడు. అతడి మృతదేహం సోమవారం లభ్యమైంది. యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెంకు చెందిన వలవల దివ్య శ్రీరామ పవన్ కుమార్ (22) ఆదివారం సెలవుదినం కావడంతో అతని స్నేహితులతో కలిసి ఆదివారం పేరుపాలెం బీచ్‌కు వచ్చాడు. ఉదయం సముద్ర స్నానానికి దిగిన పవన్ కుమార్ సముద్ర అలల ఉధృతికి కొట్టుకుపోయాడు. సోమవారం ఉదయం విగతజీవిగా తీరానికి కొట్టుకువచ్చాడు. మృతదేహాన్ని నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.



చికిత్స పొందుతున్న బాధితులు

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

కుక్కునూరు, మే 5(ఆంధ్రజ్యోతి): దాచారం పంచాయతీ నెమలిపేటలో సోమవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. తప్పించుకునే క్రమంలో 10మంది గాయపడ్డారు. వారిని కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కంటిపల్లి శిరీష, కుమారి, పట్లా దుర్గమ్మ, కారం రామారావు, కారం భద్రమ్మ, కౌలూరి శిరీష ఉన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎం.యు గంధర్, వై.నాగేంద్ర రావు వైద్యులను కోరారు.

ధాన్యం తడిచినా ఆందోళన వద్దు..

నరసాపురం రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల వల్ల తడిచిన ధాన్యం రాశులు, పొలాలను సోమవారం ఏడీఏ డాక్టర్ అనిల్‌కుమారి పరిశీలించారు. పొలాల్లో నీరు నిలిచిపోవడం వల్ల కోసిన వనలు తడిచాయని, అయితే రైతులు ఆందోళన చెందనవసరం లేదని, చేలోని వనలను బయటకు తీసి ఆరబెట్టాలన్నారు. ఆమె వెంట ఏవో జాన్సన్, సిబ్బంది పాల్గొన్నారు.

మిల్లర్లు ఇబ్బంది పెడితే ఫోన్ చేయండి

ఆకివీడు, మే 5 (ఆంధ్రజ్యోతి): తడిచిన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయకుంటే రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులకు ఫోన్ చేయాలని తహసీల్దార్ నందూరి వెంకటేశ్వర రావు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తేమశాతం అధికంగా ఉందనే నెపంతో గాని, రైతుల నుంచి ఎక్కువ సొమ్ము వసూలు చేసినా తహసీల్దార్ 94910 41467, వ్యవసాయాధికారి 94405 32647లకు ఫిర్యాదు చేయాలన్నారు.



ఎన్నార్పీ అగ్రహారం ఎస్సీ కాలనీలో విరిగిన విద్యుత్ స్తంభం

విద్యుత్ శాఖకు రూ. 15 లక్షలు నష్టం : ఏఈ

ఉండి, మే 5(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో ఉండి విద్యుత్ శాఖ కార్యాలయం పరిధిలో సుమారు రూ. 15 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఆదివారం వీచిన ఈదురుగాలులు, భారీ వర్షానికి మండలంలో 12 ట్రాన్స్‌ఫార్మర్లు, 60 విద్యుత్ స్తంభాలు నేలకూలాయని ఏఈ శ్రీనివాసరావు వెల్లడించారు. విద్యుత్ వైర్లపై చెట్లు పడిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోవడంతో నష్టం సంభవించిందన్నారు. ఆదివారం నుంచి తమ సిబ్బందితో విరామం లేకుండా విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్నామన్నారు.

పిడుగుల వల్లే అధిక మరణాలు

వాన సమయంలో చెట్ల కింద నిలుచోవద్దు : కలెక్టర్

భీమవరం టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పిడుగులు పడటం వల్ల ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయని, వర్షం సమయంలో చెట్ల కింద ఎవరు నిలుచోవద్దని కలెక్టర్ నాగరాణి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా వ్యవసాయ భూముల్లో పనిచేసేవారు ప్రతి ఒక్కరు ఈ విషయాన్ని గుర్తించుకోవాలని, చెట్ల కింద నిలుచోవడం కన్నా బహిరంగ ప్రదేశంలో ఉంటేనే పిడుగుల నుంచి రక్షించుకోగలుగుతామని తెలిపారు. పిడుగులు పడుతున్న సమయంలో సెల్ ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లో మాట్లాడకూడదని తెలిపారు. ఏయే ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉందో ముందస్తుగా వాతావరణ శాఖ ద్వారా ఫోన్‌లకు సందేశాలను పంపడం జరుగుతుందన్నారు. సందేశం వెళ్లని సమయంలో నేరుగా వెళ్లి ప్రజలను అప్రమత్తం చేయాలని మండల అధికారులకు సూచించారు. దీనికి అనుగుణంగా పిడుగులు సమాచారాన్ని ప్రజలకు ముందస్తుగా తెలియజేసేందుకు సచివాలయాల సిబ్బందిని కూడా వినియోగించాలన్నారు.

నా పుట్టిన రోజుకు రూపాయి కూడా ఖర్చు పెట్టొద్దు

క్షణం వృథా చేయొద్దు : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): తన పుట్టిన రోజును పురస్కరించుకుని అభిమానులు, కూటమి నేతలు ఎవరూ ఒక్క రూపాయి ఖర్చు చేయవద్దని, అలాగే ఒక్క క్షణం కూడా వృథా చేయవద్దని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు నియోజకవర్గ ప్రజలకు సూచించారు. మంగళవారం తన పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ మొదటి నుంచి తాను పుట్టిన రోజు జరుపకోవడం, ఆర్భాటాలకు వెళ్ళడం ఇష్టపడనని, ఇందుకు వెచ్చించే రూపాయి సేవా కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయినప్పటి నుంచి జనవరి 1, తన పుట్టిన రోజు మే 6వ తేదీలు అందుబాటులో ఉండనని, పండ్లు, స్వీట్లు, బొకేలు, దండలు వంటివి తేవద్దని, శుభాకాంక్షలు తెలియజేసే ఫ్లెక్సీలు, పేపరు ప్రకటనలు ఇవ్వద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ సారి మంత్రి హోదాలో ఉన్నప్పటికి తన పద్ధతిలో మార్పు ఉండదని తెలిపారు.



కార్ల్‌మార్క్స్ చిత్రపటం వద్ద సీపీఐ నాయకుల నివాళులు

శ్రమజీవుల రాజ్యానికి బాటలు వేసిన కార్ల్ మార్క్స్

భీమవరం రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): శ్రమజీవుల రాజ్యస్థాపనకు బాటలు వేసిన గొప్ప దార్శనికుడు కార్ల్‌మార్క్స్ అని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. కారల్ మార్క్స్ జయంతి సందర్భంగా సోమవారం భీమవరం పార్టీ కార్యాలయంలో కారల్‌మార్క్స్ చిత్రపటానికి భీమారావు పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాస్, నాగిడి శాంతమూర్తి, ప్రజానాట్య మండలి నాయకుడు చాన్‌బాషా, గుడిమెట్ల నరసింహమూర్తి, మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉపాధి కూలీల పొట్ట కొట్టవద్దు

అత్తిలి, మే 5 (ఆంధ్రజ్యోతి) ఉపాధి కూలీల కడుపు కొట్టి కాంట్రాక్టుల జేబులు నింపుతున్న ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావు అన్నారు. బల్లిపాడులో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమక్షంలో కార్ల్ మార్క్స్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్, వీరభద్రరావు మాట్లాడుతూ బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత కూలీల జాబ్‌కార్డులు సంఖ్యకు తగ్గట్టుగా బడ్జెట్లో నిధులు కేటాయించడంలేదని ఆరోపించారు. పని ప్రదేశంలో చనిపోయిన ప్రతి కూలీకి రూ. 10 లక్షలు పరిహారం అందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



పెంటపాడు, మే 5(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పెంటపాడుకు చెందిన జామి చినవెంకట్రావుకు రూ. 67,815లు, రూరల్ మండలం నందమూరుకు చెందిన గొలుసుపూడి సర్వేశ్వరరావుకు రూ 36,240లు, కొత్తూరుకు చెందిన తిరుమల వెంకటనాగలక్ష్మికి రూ. 23,920, ఎల్ అగ్రహారానికి చెందిన దంగేటి రాజుకు రూ.25 వేలు, కుంచనపల్లి గ్రామానికి చెందిన విప్పర్తి శ్రీనివాస్‌కు రూ. 45,798 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అడపా ప్రసాద్, ఫైబోయిన వెంకటరామయ్య, శనగన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో..

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

భీమవరంటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): మానవత భీమవరం శాఖ ఆధ్వర్యంలో భీమవరం మండల స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ అవార్డులు సోమవారం ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో అందించారు. ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మానవత సేవా కార్యక్రమాలే కాక రెండేళ్లగా విద్యార్థులకు నగదు అవార్డులు అందిస్తూ మరింత ప్రోత్సాహం అందించడం స్ఫూర్తినిస్తుందని కొనియాడారు. మానవత విస్తరణ అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాగి రాజు జానకి రామరాజు, సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన వర్మ, డాక్టర్ బుద్ధరాజు దీప్తి రాజు, చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు, డైరెక్టర్ ఇందుకూరి ప్రసాద రాజు, కో చైర్మన్ కార్మూరి నరసింహమూర్తి మాట్లాడుతూ గుంటూరుకు చెందిన రమాదేవి సౌజన్యంతో విద్యార్థులకు నగదు అవార్డులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాల తో పాటు డాక్టర్ దీప్తి రాజు బుద్ధరాజు సౌజన్యంతో గడియారాలను కూడా అందజేశామని తెలిపారు.

సర్కార్ బడుల్లో చేర్పించండి

తల్లిదండ్రులకు అవగాహన ● విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రణాళిక



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పెనుమంట్ర, మే 5(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా కూటమి సర్కారు ప్రణాళికలు తయారు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారని ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండల స్థాయిలో ఎంఈఓల ఆధ్వర్యంలో ఆయా పాఠశాల పరిధిలో ఉన్న ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతంతో పాటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇస్తున్న సౌకర్యాలు, విద్యాబోధన, ఆన్‌లైన్ విద్యాబోధన, విశిష్టతను తెలియజే స్తున్నారు. పెనుమంట్ర మండలంలో 2936 మంది విద్యార్థులు ఉండగా 47 ప్రభుత్వ పాఠశాలలు ఉండేవి. నూతన విద్యా విధానంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 49 పాఠశాలలకు పెరిగాయి.

ఉపాధ్యాయుల కొరత లేదు..

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో ఐదు తరగతులు ఒకే ఉపాధ్యాయుడు బోధించే పరిస్థితి ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం తీసుకున్న నూతన విద్యా విధానంలో మోడల్ పాఠశాలలో ఒక్కొక్క తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా రూపొందించారు. ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు ఫౌండేషన్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ప్రాథమికోన్నత పాఠశాలలుగా ఉన్న సోమరాజు ఇల్లిందలపర్రు, నెలమూరు గ్రామాల్లో జడ్పీ ఉన్నత పాఠశాలలు అప్ గ్రేడ్ చేశారు. మండలంలో 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చేరాయి. విద్యా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు పాఠశాల ముగిసిన అనంతరం ఇంటింటికి వెళ్లి సర్కార్ పాఠశాలల్లో విద్యార్థులను చేరిస్తే అందే పథకాలు, సౌకర్యాలు, కరాటేలో శిక్షణ, ఉచిత పాఠ్యపుస్తకాలు, బూట్లు, బ్యాగులు, యూనిఫాం దుస్తులు ఇతర వసతులపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే ప్రతి పంచాయతీలో ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ పాఠశాలలపై వివరిస్తున్నారు.

ఉత్సాహాన్నిస్తున్న టెన్త్ ఫలితాలు

ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్కులు, ర్యాంకులు రావటంతో ప్రభుత్వ ఉపాధ్యాయులకు కొత్త ఊపునిచ్చింది. దీంతో గ్రామాల్లో ఇంటింటికి వెళ్ళి అవగాహన కల్పిస్తున్నారు.



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కాళ్ళ మే 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణ రాజు అన్నారు. దొడ్డనపూడిలో సుమారు రూ. 28 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను సర్పంచ్ కొల్లి సుబ్బారావుతో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు నిధులతో త్వరలోనే గ్రామంలోని మెయిన్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. జనసేన ఉండి ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, జనసేన మండలాధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. కాళ్ళ గ్రామంలో గ్రామదేవతలు శ్రీ మహంకాళమ్మ, శ్రీ వెంకమ్మ అమ్మవార్లకు రఘురామరాజు సోమవారం పూజలు చేశారు. అనంతరం అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో కళావేదికను ప్రారంభించారు. అనంతరం రఘురామను గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

రైతులకు అండగా కూటమి : ఆరిమిల్లి

తణుకు, మే 5(ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ దురుద్దేశంతోనే వైసీపీ శ్రేణులు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. గతంలో వైసీపీ విధానాల వల్ల అనేక మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, కనీసం పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు ఆరు నెలలు గడిచినా చెల్లింపులు చేయకుండా ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని, కోట్లాది రూపాయలు బకాయి పెడితే కూటమి అధికారంలోకి వచ్చాక రైతులకు చెల్లించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో లక్ష్యానికి అనుగుణంగా 27 లక్షల పైగా గోనె సంచులు అందించామని, రానున్న రెండు రోజుల్లో మరో మూడు లక్షల సంచులు అందిస్తామన్నారు. మిల్లర్లు కూడా రైతులకు సహకరించి ధాన్యం సేకరణలో సహకరించాలని కోరారు.

చురుగ్గా అభివృద్ధి పనులు

పాలకొల్లు రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు మండలం గవరపేటలో రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు మంజూరు చేసిన నిధులు రూ.1.75 కోట్లతో చేపట్టిన పంటకాల్వ వెంబడి రక్షణ గోడ నిర్మాణ పనులకు సోమవారం పాలకొల్లు ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి పనులు పూర్తిగా పడకేశాయనీ, కూటమి ప్రభుత్వం రాగానే అభివృద్ధి, సంక్షేమానికి మోక్షం కలిగిందన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

మొగల్తూరు, మే5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలని అఖిలభారత మానవ హక్కుల సంస్థ చైర్మన్ డాక్టర్ ఫిలోమిన కోరారు. సోమవారం మొగల్తూరులో షారోన్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మానవ హక్కులపై అవగాహన కల్పించేందుకు మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎం.యాకోబ్ జయ కుమార్‌ను ఆదేశించారు. మాన హక్కుల ముఖ్య ఉద్దేశ్యాలు లక్ష్యాలు వివరించారు. ఫౌండర్ చైర్మన్ డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

సావిత్రమ్మ సేవలు చిరస్మరణీయం

ఆకివీడు, మే 5 (ఆంధ్రజ్యోతి) : కార్మిక మహిళా నేతగా మారుబోయిన సావిత్రమ్మ పోరాటాలు చిరస్మరణీయమని ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జోకల లక్ష్మి, నందక ఉదయకుమారి కొనియాడారు. సావిత్రమ్మ వర్ధంతి సందర్భంగా స్థానిక 14వ వార్డులో ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, నగర పంచాయతీ పారిశుధ్య మహిళా కార్మికులకు సావిత్రమ్మ కోడలు అరుణకుమారి చీరలు, పండ్లు అందజేశారు.





భీమవరం, తణుకులో అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారులు హనీష, కృష్ణ సత్యలత

కార్మికులకు హక్కులపై అవగాహన ఉండాలి

భీమవరం క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మిక హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన ఉండాలని, హక్కులకు భంగం కలిగితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటారని భీమవరం ఒకటో అదనపు సివిల్ జడ్జి పి.హనీష అన్నారు. భీమవరంలో సోమవారం అసంఘటిత రంగ కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించి కనీస వేతన చట్టం, పథకాలపై అవగాహన కల్పించారు. ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్ కుమార్, ఎన్.సుధీర్, పి.అంబేడ్కర్, కె.జ్యోతి, సీఐటీయూ నాయకుడు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు: కార్మికులకు వర్తించే పథకాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయాధికారి కె.కృష్ణ సత్యలత అన్నారు. సోమవారం ఆటో యూనియన్ స్టాండు వద్ద చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులకు ఉన్న పథకాలు, ఉచిత న్యాయ సహాయం, న్యాయం, చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని చెప్పారు. సమావేశంలో న్యాయవాదులు సూరంపూడి కామేష్, కౌరు వెంకటేశ్వర్లు, పొట్ల సురేష్, సిడిపిఓ పద్మని కుమారి, ఆటో యూనియన్ నాయకులు పి.రాంబాబు, ఎం. విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

నిరసనలు...

తాడేపల్లిగూడెం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, ఉద్యోగులకు కనీస వేతనం రూ.35 వేలు నిర్ణయించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం, ఏరియా ఆసుపత్రి వద్ద సోమవారం కార్మికులు ధర్నా చేశారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె. లక్ష్మీనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు.

ఉపాధ్యాయులు ధర్నా

తణుకు: విద్యాశాఖ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టినట్లు ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రామ్మోహనరావు తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యలయం వద్ద ధర్నా నిర్వహించారు. పాఠశాలల వర్గీకరణ విధానాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ నాయకులు పీఎస్‌వి ప్రసాదరావు, కె.రాంబాబు, జనార్దన స్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఎదుట..

పెనుమంట్ర: ఎంఎల్‌హెచ్పీలు, ఫీల్డ్‌స్టాఫ్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పెనుమంట్ర పీహెచ్‌సీ వద్ద ఏఎన్‌ఎంలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని దశల వారి ఉద్యమం చేపడితే సూపర్‌వైజర్ల సంఘం అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో తగిన గుణపాఠం చెబుతామని డిమాండ్ చేశారు. హెచ్‌ఎస్ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం..

నరసాపురం రూరల్: సారవలో మంచినీళ్ల కోసం గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. 4 రోజులుగా కుళాయి నీరు ఎందుకు రావడం లేదని అధికారుల్ని నిలదీశారు. దీంతో విచారణ చేయిస్తామని ఏఈ లోకేశ్ తెలిపారు. కాగా విచారణలో ఎల్‌బీ చర్ల గ్రామం నుంచి సారవ వెళ్లే పైప్‌లైన్‌ను కొందరు వ్యక్తులు కట్టేసినట్లు గుర్తించారు. వెంటనే పైప్‌లైన్‌ను సరి చేసి మంగళవారం ఉదయానికి గ్రామానికి నీళ్లు విడిచిపెడతామని ఏఈ తెలిపారు. దీంతో నీళ్ల సమస్య సద్దుమణిగింది. అంతకుముందు గ్రామస్థులు విప్ నాయకర్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేయగా విప్ నాయకర్ సమస్యను తక్షణం పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.



భవానీకి నియామక పత్రం ఇస్తున్న కృష్ణయ్య

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గణేష్ భవాని

పాలకొల్లు అర్బన్, 5(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ముద్దాడ గణేష్ భవాని నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య తనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు భవానీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా కేంద్రం కుల గణన నిర్ణయం తీసుకుని అమలు చేయడం హర్షణీయమన్నారు. తనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన కృష్ణయ్యకు, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో పాలకొల్లులో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు గణేష్ భవానీ తెలిపారు.



రామారావుకు అవార్డు అందిస్తున్న దృశ్యం

ముత్యాల రామారావుకు అవార్డు

పాలకొల్లు, మే 5(ఆంధ్రజ్యోతి): పాలకొల్లుకు చెందిన ముత్యాల రామారావు 2024-25 సంవత్సరానికి గాను లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ స్థాయిలో రాష్ట్ర అవార్డును అందుకున్నారు. రాష్ట్రంలోని అన్ని లయన్స్ జిల్లాలు, క్లబ్ ల నుంచి ఉత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి, ప్రతి ఏటా ఈ అవార్డులు అందిస్తారు. లయన్స్ మల్టిపుల్ కన్వెన్షన్‌లో రామారావుకు ఈ అవార్డును ప్రదానం చేశారు. మల్టిపుల్ కౌన్సిల్ చైర్పర్సన్ లయన్ డి.శ్రీశాంతి లయన్స్ జిల్లా 316డి గవర్నర్ లయన్ గద్దె శేషగిరి సమక్షంలో ఈ రామారావుకు అవార్డును అందచేశారు. ముత్యాల రామారావు గత 27 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ సభ్యుడిగా సేవలందిస్తున్నారు.



అ'పూర్వ' కలయిక

కాళ్ళ, మే 5 (ఆంధ్రజ్యోతి): కాళ్ళ హైస్కూల్‌లో 2000-2001లో చదివిన టెన్త్ బ్యాచ్ విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. 25 ఏళ్ళ క్రిందట కలిసి చదువుకున్న విద్యార్థులంతా పాఠశాలలో కలుసుకుని పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తీర్మానాలు చేసుకున్నారు. వినోద కార్యక్రమాలు నిర్వహించి ఒకరికొకరు ఆత్మీయ వీడ్కోలు చెప్పుకున్నారు.

రైతుకు పాముకాటు.. తప్పిన ముప్పు

వంజరం పాములతో గ్రామస్థుల హడల్

ఆచంట, మే 5(ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం పెదమల్లంలో రెవెన్యూ అధికారులు రీ సర్వే ప్రారంభించారు. అయితే సోమవారం గ్రామానికి చెందిన ఆదిమూలం మాచిరాజు భూమిని రీ సర్వే చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు రైతు మాచిరాజును వంజరం పాము కాటేసింది. దీంతో అతనిని వెంటనే అధికారులు ఆచంట వేమవరం పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మాచిరాజు కోలుకుంటున్నారు. వైద్యులు ఎటువంటి ప్రమాదం లేదనడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా రీ సర్వేలో సిబ్బంది కాళ్లకు రక్షణ ఏర్పాటు చేయాలని పలువురు అంటున్నారు. కాగా పెదమల్లంలో వంజరం పాముల బెడద ఎక్కువైంది. వీటి కాటు వల్ల ఇద్దరు మరణించిన ఘటనలు కూడా ఉన్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉండి, మే 5(ఆంధ్రజ్యోతి): ఆదివారం గాలివానకు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని భీమవరం ఈఈ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. కోలమూరు, పాందువ్వ, కలిగొట్ల, ఆరేడు, పాములపర్రు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

పాలకొల్లు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునే విధంగా తమ సంస్థ ద్వారా ఈ నెల 8వ తేదీ నుంచి నెలరోజుల పాటు ఉచితంగా కంప్యూటర్, తెలుగు, ఇంగ్లీషు కీబోర్డు, చెస్, వ్యక్తిత్వ వికాసంపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయుర్వేద జ్యోతి పత్రిక సంపాదకులు పప్పుల దుర్గామల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. ఇంకా నటన, ఉపన్యాసం, గజల్స్, భక్తి గీతాలు, ఇంద్రజాల విద్యల్లో కూడా శిక్షణ ఇస్తామని, రేపాక వారి సత్రం వెనుక వైపు గల తమ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకూ ఆయా రంగాల్లో నిపుణులచే శిక్షణ ఉంటుందని, మరిన్ని వివరాలకు 92905 40512 ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

డ్రెయిన్లో చెత్త వేయవద్దు

తణుకు, మే 5(ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లో చెత్త వేయవద్దని సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కోయాక్సిల్ రోడ్డులోని అంగన్ వాడీ సెంటర్ ఆవరణలోను, పరిసరాలను దోమల పెరిగే అవకాశాలున్న ప్రాంతా లను పరిశీలించారు. నీరు నిల్వచేసే పాత్రలపై మూత పెట్టాలన్నారు. ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల వినతిపత్రం

తణుకు, మే 5(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసి ఉద్యోగులు తహసీల్దార్ అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. ఎన్‌ఎంయు కేంద్ర కమిటీ పిలుపు మేరకు సమస్యలపై పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. యూనియన్ అధ్యక్షుడు సరిదే ఏసుబాబు, సెక్రటరీ బయ్యే సుబ్బారావు, తలారి శ్రీనివాసు, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పని దినాలు పెంచాలి

పెంటపాడు, మే 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సోమవారం పలు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కనీస వేతనం రూ. 700లకు పెంచాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య సమస్యలపై ఫిర్యాదు

నరసాపురం టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా సిబ్బంది సమర్థంగా పని చేయాలని కమిషనర్ అంజయ్య ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పారిశుధ్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఆయన పై విధంగా స్పందించారు. ఆయన వెంట ప్రసాద్, కిశోర్ పాల్గొన్నారు.

మొగల్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు ఫిర్యాదులు వచ్చినట్టు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ తెలిపారు. కేపీ పాలెంకు చెందిన హనుమంతరావు అనే వ్యక్తి తన భూమిని ఆన్‌లైన్ చేయాలని, వివాదంలో ఉన్న త మ స్థలాన్ని సర్వే చేసి న్యాయం చేయాలని మరొకరు వినతులు అందించారు. ఎంపీడీవో సీహెచ్. త్రిశూలపాణి, అధికారులు పాల్గొన్నారు.

కళాశాలలో వార్షిక పత్రిక

పాలకొల్లు అర్బన్, 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు తమ కళాశాల ప్రతి ఏటా వార్షిక పత్రికను విడుదల చేస్తోందని డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శోభారాణి అన్నారు. సోమవారం కళాశాల వార్షిక పత్రికను విడుదల చేశారు. వార్షిక పత్రికలో కథలు, కథానికలు, చిత్రాలు విద్యార్థినులే వేశారన్నారు.

చెరువు నీరు పరిశీలన

ఉండి, మే 5(ఆంధ్రజ్యోతి): ఉండి మంచినీటి చెరువు నీళ్లను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పరిశీలించారు. సోమవారం ఉండి మంచినీటి చెరువు, పరిసరా లను పరిశీలించారు. అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు శ్రీనివాసరావు, హరినాథ్‌రాజు మాట్లాడుతూ ఉండిలోని మంచినీటి చెరువునీరు ప్రజలు తాగేందుకు అనువుగానే వుందన్నారు. ప్రజలు, అధికారులు ఆందోళన చెందన వసరంలేదన్నారు. పంచాయతీ వారు ప్రజలకు మంచినీటిని ఇచ్చేటపుడు తగు జాగ్రత్తలు తీసుకుని ఇవ్వాలని సూచించారు. గ్రామ కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి శ్రీవారి కల్యాణోత్సవాలు

తణుకు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 55వ కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పీ సూర్యనారాయణ తెలిపారు. ఈ నెల 8వ తేదీ రాత్రి 7 గంటలకు స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. కల్యాణోత్సవాల సందర్భంగా 9, 10 11, 12 తేదీల్లో ఆలయ ప్రాంగణంలో గీతా పారాయణం, భజన, కోలాటం తదితర కార్యక్రమాలుంటాయని, 13న అన్న సమారాధన ఉంటుందన్నారు.